క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



మైలవరం: స్థానిక తారకరామానగర్ నాల్గో సెగ్మెంట్ ఏరియాలోని సాగి సరోజినీదేవికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.65,000 చెక్కును ఎంపీటీసీ సభ్యురాలు సీతమ్మ శుక్రవారం లబ్ధిదారుకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వరరావు, రంగారావు, జగదీష్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృందం ప్రదర్శన

నూజివీడు: మొర్సపూడి పీఏసీఎస్ పరిధిలోని గొల్లపల్లి, పోలసానపల్లిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రజలకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న పలు పథకాలను వివరించారు. ప్రతి ఒక్కరూ సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు ఖాతాను తెరవడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఏటీఎం కార్డు, డెబిట్ కార్డు, రూపే కార్డు సేవలు పొందవచ్చని తెలిపారు.

జగనన్న పాలనలో ప్రజలు సుభిక్షం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడులోని 6,7 వార్డుల్లో శుక్రవారం ఎమ్మెల్యే ప్రతాప్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి అందిన లబ్ధి వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి రూ.60 వేల నుంచి రూ.4 లక్షల వరకు పథకాల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలనను అందించారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ 99 శాతం అమలు చేయడమే కాకుండా పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించారన్నారు. చంద్రబాబు అండ్ కో మాయమాటలు చెప్పి ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తున్నారని, వారి మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, కౌన్సిలర్ దాసరి మారు అప్పాజీ, నాయకులు శ్రీను, రంజిత్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, జోగారావు, నాగేశ్వరరావు, డీఈ లక్ష్మీనారాయణ, సీఎంఎం ఆనంద్ పాల్గొన్నారు.

ఘనంగా రాజా సుధాకరరావు జన్మదిన వేడుకలు



జమీందార్ సుధాకరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: మైలవరం జమీందారు, ద్వారకా తిరుమల దేవస్థానాల పాలక మండలి చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త రాజా ఎస్వీ సుధాకరరావు 83వ జన్మదిన వేడుకలు పట్టణంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం ఘనంగా నిర్విహించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ముందుగా రాజా సుధాకరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. రాజా సుధాకరరావును గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గంగాధరరావు, ఎంపీపీ ప్రసన్నరాణి స్వామి, సర్పంచ్ మంజు భార్గవి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయండి

నూజివీడు: ఈనెల 9,10 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాలైన మధ్యాహ్న భోజన పథకం యూనియన్, స్కూల్ ఆయాలు తదితర సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా మహాసభల కరపత్రాన్ని శుక్రవారం నూజివీడులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పుల్లారావు మాట్లాడుతూ ఈ మహాసభలకు కార్మికులందరూ తరలిరావాలని కోరారు.

రైతులను ఆదుకునేలా చర్యలు

నరసాపురం (విస్సన్నపేట): తుపానుతో నష్టపోయిన పంటను అంచనా వేసి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహామండలి సభ్యులు తీర్మానించారు. మండల వ్యవసాయ సలహామండలి సమావేశం ఆ మండలి జిల్లా అధ్యక్షుడు దామోదరరెడ్డి అధ్యక్షతన విస్సన్నపేట మండలం నరసాపురం ఆర్బీకేలో శుక్రవారం జరిగింది.

నష్టపోయిన పంటలను నమోదు చేయాలి

మండలంలో తుపానుతో నష్టపోయిన పంటలను నమోదు చేయాలని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. నరసాపురంలో జరిగిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. అనంతరం గ్రామంలో తుపానుతో వరిగిపోయిన వరిపంటలను పరిశీలించారు. ఏఓ రాజ్యలక్ష్మి, ఉద్యాన అధికారి నరేంద్రకుమార్, మండలి సభ్యులు చెన్నారెడ్డి, శ్రీను, వెంకటరత్నం, విద్యుతుశాఖ ఏఈ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం మొలకెత్తకుండా సూచనలు

తిరువూరు: తుపాను కారణంగా తడిసిన ధాన్యం మొలకలు రాకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గరికపాడు వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త మధువాణి సూచించారు. పాతతిరువూరులోని వరిపాలాలను స్థానిక అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించిన ఆమె రైతులకు పలు సూచనలిచ్చారు. ఉప్పు ద్రావణం ఐదు శాతం తడిసిన పంటపై పిచికారీ చేస్తే మొలకలు రావని తెలిపారు. కోత పూర్తయిన పొలాల్లో ధాన్యాన్ని వర్షాలకు తడవకుండా పట్టాలు కప్పాలని, సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధనా సంస్థ కీటక శాస్త్ర నిపుణులు రాజశేఖర్, తిరువూరు వ్యవసాయాధికారి పద్మ, పాల్గొన్నారు.

పొలాల్లో నష్టనివారణ చర్యలు చేపట్టండి

త్రిలోచనాపురం(ఇబ్రహీంపట్నం): తుపాను వలన దెబ్బతిన్న వ్యవసాయ పంట పొలాల్లో నష్టనివారణ చర్యలు చేపట్టాలని ఉయ్యూరు వ్యవసాయ పరిశోధనా సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డి.సుధారాణి తెలిపారు. త్రిలోచనాపురంలో వరి, పత్తి, మిరప, మొక్కజొన్న తోటలను శుక్రవారం పరిశీలించారు. ఏఓ డి.శైలజ, ఏఏఓ సాయికిరణ్ పాల్గొన్నారు.

పంట నష్టంపై సర్వే

చాట్రాయి: తుపాను వల్ల ఏర్పడిన పంట నష్టంపై సర్వే చేస్తున్నట్లు వ్యవసాయాధికారి శివశంకర్ తెలిపారు. మండలంలోని మర్లపాలెంలో నిర్వహిస్తున్న పంట సర్వేని శుక్రవారం ఆయన పరిశీలించారు.

జి.కొండూరులో..

జి.కొండూరు(మైలవరం): నష్టపోయిన ప్రతి రైతును వైఎస్సార్ ప్రభుత్వం ఆదుకుంటుందని జి.కొండూరు ఎంపీపీ లక్ష్మితిరుపతమ్మ తెలిపారు. జి.కొండూరు గ్రామంలోని కప్పలవాగు వద్ద తుపాను వలన దెబ్బతిన్న వరి పొలాలను రైతులు, అధికారులతో కలిసి ఎంపీపీ శుక్రవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటికే జి.కొండూరులో వరి 82 ఎకరాలు, ఈ–క్రాప్ నమోదు అయ్యిందన్నారు. సర్పంచ్ మండల అరుణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు విష్ణు, అగ్రికల్చర్ అసిస్టెంట్ అనితపాల్గొన్నారు.

పంటల నష్టం అంచనాలు ప్రారంభం

ముసునూరు: తుపాను బారినపడి పంట నష్టపోయిన రైతులను గుర్తించి, పెట్టుబడి రాయితీ అందించేందుకు ప్రభుత్వం విధి విధానాలను రూపొందించినట్లు, అంచనాలను ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి మధుమోహన్ తెలిపారు. మండలంలోని చెక్కపల్లిలో నీటమునిగిన వరి పొలాలను సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. వరి, వేరుశనగ, పత్తి, మిర్చి, పుచ్చ, బొప్పాయి, పూలు, కూరగాయల పంటలకు సంబంధించి ఒక హెక్టారుకు రూ.17,000, మొక్కజొన్న పంటకు హెక్టారుకు రూ.12,500, పొగాకు, మినుము, పెసలు వంటి అపరాల పంటలకు రూ.10,000 పెట్టుబడి రాయితీగా అందజేస్తారని ఆయన తెలిపారు.

జగనన్నను మరోసారి బలపరచాలి



ఊటుకూరులో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

ఊటుకూరు(గంపలగూడెం): అభివృద్ధిని కాంక్షించే వారు సంక్షేమ పథకాల రథసారధిగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మరోపర్యాయం ఎన్నుకోవాల్సి ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరులో శుక్రవారం రాత్రి పల్లెకుపోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో నాలుగున్నర సంవత్సరాలుగా అమలుపరచిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. గ్రామ ప్రధాన కూడలి వద్ద వైఎస్సార్ సీపీ జెండాను వెంకటేశ్వరరావు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నాడూ లేని విధంగా అర్హత ప్రామాణికంగా సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు పరిచిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఉప సర్పంచ్ రాఘవయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నరసారెడ్డి, నాగేంద్రరావు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను కలిసిన ఎస్సై

జి.కొండూరు(మైలవరం): ప్రజలకు అందుబాటులో ఉంటూ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మహ్మద్ షబ్బీర్ అహ్మద్ మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను ఐతవరంలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని సూచించారు.

సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నీకి పవన్ ఎంపిక



సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నీకి ఎంపికైన పవన్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

జూపూడి(ఇబ్రహీంపట్నం): సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు జూపూడి నిమ్రా నర్సింగ్ కళాశాల విద్యార్థి వి.పవన్ ఎంపికయ్యాడు. గత నెల 29న విజయవాడ డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పవన్‌ను ఎంపిక చేసినట్లు శుక్రవారం ఆదేశాలు అందినట్లు కళాశాల అకడమిక్ డైరెక్టర్ నారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 22నుంచి 25వ తేదీ వరకు బెంగళూరు విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, రీసెర్చ్ అకడమిక్ డైరెక్టర్ బాబులాల్, పీడీ సత్తార్‌ఖాన్ పవన్‌ను అభినందించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చాట్రాయి: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని జనార్దనవరం, కోటపాడు, చీపురుగూడెం, పోలవరం గ్రామాల్లో సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు ఏఈ రామారావు తెలిపారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవినీతి నిర్మూలనపై అవగాహన సదస్సు

ఆగిరిపల్లి: అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ సందర్భంగా ఆగిరిపల్లి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచి యువత సమాజం, భారతీయ చట్టాలపై అవగాహన పొంది యువత అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండాలన్నారు. మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ అధ్యక్షుడు అయ్యంకి సురేష్ బాబు మాట్లాడుతూ లంచాలు ఇవ్వడాన్ని వ్యతిరేకించి చట్టపరంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కూరపాటి యోహాను, సామాజికవేత్త పాతూరి రవి, భాగ్యలక్ష్మి ఇండియన్ గ్యాస్ నిర్వాహకులు పాలడుగు శ్రీనివాస్, చిమట శ్రీనివాసరావు, విశ్వ భారతి ట్రస్ట్ అధ్యక్షుడు లాల్ సాహెబ్ పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వహించాలి

గంపలగూడెం: ఉపాధి సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఏపీడీ మణికుమార్ తెలిపారు. మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించి శుక్రవారం సోషల్ ఆడిట్‌లో భాగంగా గంపలగూడెంలో ప్రజావేదిక నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. పలు గ్రామాల్లో నాటిన మొక్కలు కన్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత మొత్తాన్ని రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఈ ఏడాది ఎస్ఎస్ఏ, పీఆర్, ఈజీఎస్ డిపార్టుమెంట్ల ఆధ్వర్యంలో 2,245 పనులకు రూ.18 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ ఏపీడీ పార్థసారథి, అంబుడ్స్‌మెన్ ఇమ్మానియేలు, డీపీఓ విజయలక్ష్మి, ఎస్ఆర్పీ సింహాద్రి, విజిలెన్స్ ఏఈ రాణాప్రతాప్, ఎంపీడీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్లకు ముగిసిన శిక్షణ

గంపలగూడెం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహణలో భాగంగా గంపలగూడెం మండలంలో ఎంపిక చేసిన సచివాలయ క్రీడా వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. గంపలగూడెం హైస్కూల్లో క్రికెట్, వాలీబాల్ ఆటకు, పెనుగొలను హైస్కూల్లో కబడ్డీ, పెద్ద కొమిర మోడల్ స్కూల్లో షటిల్ బ్యాడ్మింటన్, నెమలి హైస్కూల్లో ఖో–ఖోలో వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ తరగతులకు గేమ్స్ ఇన్‌చార్జిలుగా బి.విజయలక్ష్మి, రూతు, గోపాల్‌రావు, రాంబాబు, అంజయ్య, ఆంజనేయులు, యాకూబ్, నాగుల్‌పాషా, ఎం. రమాదేవి వ్యవహరించారు.

తిరువూరురూరల్‌లో..

తిరువూరురూరల్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని వలంటీర్లకు శుక్రవారం వ్యాయామోపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. కబడ్డీ, క్రికెట్ పోటీల నిర్వహణపై మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, ఖోఖో ఆటపై మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, వాలీబాల్‌లో తిరువూరు జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో, షటిల్ బ్యాడ్మింటన్‌పై తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు.

9,400 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

మైలవరం: మైలవరం మార్కెట్ యార్డులో ఇప్పటి వరకు 800 మంది రైతుల నుంచి 9,400 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి రూ.6.58 కోట్లు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర తీసుకోవాలన్నారు. దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వేమిరెడ్డిపల్లి(విస్సన్నపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి, మారేమండ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఉజ్వల పథకంలో అర్హులైన వారికి గ్యాస్ కనెక్షన్ అందజేశారు. వేమిరెడ్డిపల్లి సర్పంచ్ విజయకుమారి, మారేమండ సర్పంచ్ రామచంద్ర పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి భూమిపూజ

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): తుమ్మలపాలెం గ్రామంలో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం భూమిపూజ చేశారు. జిల్లా మైనింగ్ నిధులు రూ.17లక్షల వ్యయంతో శ్మశాన వాటికలో కర్మల భవనం, ప్రహరీ గోడ, పార్థీవ దేహాలు దహనం చేసే ప్లాట్‌ఫాం నిర్మిస్తారని ఆయన తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా సాధ్యమైనన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిధుల సౌలభ్యం బట్టి ప్రాధాన్యతా క్రమంలో పనులు జరుగుతున్నాయన్నారు. సర్పంచ్ బొమ్ము వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు శివారెడ్డి, లంకే అంక మోహనరావు, శ్రీనివాసరావు, రామలక్ష్మణ్, సీహెచ్ చిట్టిబాబు, చిన్నయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ

ఇబ్రహీంపట్నం: శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీసీటీ కల్యాణ మండపంలో శనివారం నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు యోగా గురువు లంకే జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన బైక్ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గ్రామానికి చెందిన ఫణికృష్ణ తన సోదరిని కళాశాలకు పంపేందుకు బస్ ఎక్కించి రోడ్డు దాటుతున్న క్రమంలో హైవేపై వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఫణికృష్ణకు స్వల్ప గాయాలు కాగా బైక్‌పై ఉన్న ఇద్దరిలో ఒకవ్యక్తి తలకు గాయమైంది. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం విజయవాడ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రక్తదానం చేయండి

జూపూడి(ఇబ్రహీంపట్నం): ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని నిమ్రా కళాశాల అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఆంధ్రా బ్లడ్ సెంటర్ సౌజన్యంతో కళాశాలలో రక్తదాన శిబిరం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేయడం ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అన్నారు. డాక్టర్ అచ్యుత్‌బాబు, ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నూజివీడు: పట్టణంలోని కోర్టు భవనాల ఆవరణలో శనివారం ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ శుక్రవారం తెలిపారు. దీనిలో పరిష్కరింపదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ ప్రమాదాల నష్టపరిహార కేసులు, చెక్‌బౌన్స్, మనోవర్తి తదితర కేసులు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని జడ్జి విజ్ఞప్తి చేశారు.

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

రెడ్డిగూడెం: తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. ఏఓ సురేష్, రైతు సమాఖ్య మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సభ్యుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.